ములుగును సస్యశ్యామలం చేస్తాం : మంత్రి సీతక్క

గోదావరి జలాలు విడుదల సందర్భంగా పూలు చల్లుతున్న మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లాలోని ములుగు పంపు హౌస్ నుంచి జంగాలపల్లి బంజరు చెరువుకు గోదావరి నీటిని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ములుగు నియోజకవర్గానికి చుక్క నీరివ్వకుండా సిద్ధిపేట, సిరిసిల్లకు నీటిని తరలించుకుపోయారని అన్నారు. రాబోయే రోజుల్లో ములుగు పంపు హౌస్ నుంచి కొత్తగూడ, గంగారాం మండలాలకు గోదావరి జలాలు అందించి అక్కడ రైతాంగాన్ని ఆదుకుంటామని అన్నారు. రెండు పంటలకు నీళ్లను అందిస్తామని, త్వరలోనే పంపు హౌస్ నుంచి కాశిం దేవిపేట మీదుగా కెనాల్ ద్వారా లక్నవరంకు నీళ్లను పంపింగ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బాణోత్, రవిచందర్‌తోపాటు అధికారులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మనుధర్మాన్ని మళ్లీ తెచ్చేందుకు బిజెపి కుట్ర

- కవులు, కళాకారులు తమ కళాలకు, గళాలకు పదును పెట్టాలి
- 'మనుస్మృతి-భారత రాజ్యాంగం' చర్చాగోష్టిలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మనుషుల్ని మనుషులుగా గుర్తించలేని మధ్యయుగాల నాటి మనుధర్మాన్ని మళ్లీ తెచ్చేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, దాని అనుబంధ సంఘాలు కుట్రలు పన్నుతున్నాయి. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు ఆ కోవలోనివే. వాటిని తరిమి కొట్టేందుకు మరో సామాజిక, సాంస్కృతిక ఉద్యమం రావాలి' అని వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'మనుస్మృతి-భారత రాజ్యాంగం' అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో టిపిఎస్‌కె నాయకులు జి.రాములు మాట్లాడుతూ.. 26 స్మృతులు, 26 వందలకు పైగా శ్లోకాలు ఉన్న ఈ గ్రంథం మెజార్టీ ప్రజలను బానిసలుగా మార్చి, వారిపై బ్రాహ్మణాధిపత్యాన్ని రుద్దిందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వేళ్లు సమానంగా ఉన్నాయా? దేవుడే ఎక్కువ తక్కువలు సృష్టించారు. నుదుటిరాత అంటూ ఇప్పటికీ సామాన్య జనం తమకు తెలియకుండానే మనుధర్మంతో మమేకమై పోయారు" అని అభిప్రాయపడ్డారు. సతీసహగమనం, బాల్యవివాహాలు, చరఖపూజ లాంటి అమానవీయ ఆచారాలను సహజధర్మాలుగా వ్యాపింపజేశారని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ ఆ అవశేషాలు అక్కడక్కడా కనిపిస్తున్నాయని గుర్తు చేశారు. చాతుర్వర్ణ వ్యవస్థను మనుషులకు తెలియకుండానే వారి నరనరాల్లో జొప్పించిన ఈ ఆటవిక జీవన విధానాన్ని మళ్లీ తెరపైకి తెచ్చేందుకు బిజెపి ప్రయత్నాలు ముమ్మరం చేసిందని హెచ్చరించారు. మనుషుల జీవన విధానంతో పెనవేసుకుపోయిన ఈ భావజాలాన్ని పారదోలేందుకు మరో సామాజిక, సాంస్కృతిక ఉద్యమానికి కవులు, కళాకారులు తమ కళాలకు, గళాలకు పదును పెట్టాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ "మనుధర్మ శాస్త్రంలో ధర్మం లేదు. అణచివేత ఉంది. అవమానం ఉంది. అలాంటి ఫ్యూడల్ సంస్కృతిని తిరిగి తెచ్చేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి" అని పేర్కొన్నారు. తమకు పూర్తి స్థాయిలో అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని నిజామాబాద్ ఎంపి అర్వింద్ లాంటి బిజెపి నేతలు బహిరంగంగా అంటున్నారని గుర్తు చేశారు. వీరిని కట్టడి చేయకపోతే దేశాన్ని తిరిగి చాతుర్వర్ణ వ్యవస్థలోకి తీసుకుపోతారని హెచ్చరించారు. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ.. పూలే, సాహు, అంబేద్కర్ తదితర సామాజిక ఉద్యమకారులు మనుధర్మ శాస్త్రాన్ని ఎదురించి వందేండ్ల కిందనే అట్టడుగు వర్గాల ప్రజలకు హక్కులు సాధించారని పేర్కొన్నారు. 1927 డిసెంబర్ 25న మనుధర్మాన్ని తగలబెట్టడం ద్వారా ప్రజలకు ఓ కొత్త సందేశాన్ని అందించారని గుర్తు చేశారు. ఒకప్పుడు కనీస హక్కులు కూడా లేని దళితులు, బిసిలకు గౌరవంగా జీవించే హక్కును కల్పించిన రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా తిరిగి అలాంటి ధర్మాన్ని తెచ్చే ప్రయత్నాలు చేస్తున్న వర్గాల నుంచి దేశాన్ని కాపాడాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, అవాజ్ రాష్ట్ర అధ్యక్షులు అబ్బాస్, టిపిఎస్‌కె నాయకులు బిక్షమయ్య, డివైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంబెనగల్‌కు సంతాపం

భారతీయ చలన చిత్ర రంగంలో అభ్యుదయ, సామాజిక చిత్రాల ఆద్యుడు శ్యాంబెనగల్ మృతి పట్ల సమావేశం సంతాపం ప్రకటించింది. హైదరాబాద్‌తో అయనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. అయన తీసిన మొదటి సినిమా 'అంకూర్' తెలంగాణలోని భూస్వామ్య, దోపిడి, అణచివేతలను కండ్లకు కట్టిందని కొనియాడారు.

సిఎం గారూ.. వారి ఆవేదనను అర్థం చేసుకోండి

- 'ఎక్స్'లో హరీశ్‌రావు కామెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీని సిఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మెదక్‌లో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను పోలీసులు నిర్బంధించడాన్ని బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల టెంట్ల ముందు నుంచే వెళ్లిన సీఎం, టెంట్లు తొలగించడం కాదు, వారి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. 15 రోజులుగా ఆందోళన చేస్తున్న వారి ఆవేదనను అర్థం చేసుకోవాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చాయ్ తాగినంత సేపట్లో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు తీరుస్తామని రేవంత్ రెడ్డి చెప్పిన మాటను హరీశ్‌రావు ఈసందర్భంగా గుర్తుచేశారు. వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి, ఏడాది గడిచినా ఉలుకు లేదు, పలుకు లేదని విమర్శించారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న విధంగానే సమగ్ర శిక్ష ఉద్యోగులను కూడా కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ నిర్బంధాలకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది హేయమైన చర్య అని విమర్శించారు. నిర్బంధించిన సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణమే విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో చెప్పినట్టుగా రెగ్యులరైజేషన్ సహా ఇతర హామీలను నిలబెట్టుకోవాలంటూ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కెసిఆర్‌ను కలిసిన రాజీవ్‌సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌ను తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. కెసిఆర్‌కు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిషప్ నెహేమియా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కెసిఆర్‌ను కలిసినవారిలో క్రిస్టియన్ జెసి నాయకులు సోలోమన్ రాజు, న్యూలైఫ్ చర్చెస్ బిషప్ నెహెమియా, క్యాథలిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లియో లూయిస్ తదితరులున్నారు.

హెల్త్, ఎడ్యుకేషన్‌లో
క్రిస్టియన్ మిషనరీలు ఆదర్శం

- దేశంలోనే మెదక్ చర్చికి గుర్తింపు
- దళిత, గిరిజన క్రిస్టియన్లకు ఇందిరమ్మ ఇండ్లు అత్యధికం
- రూ.750 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఏడుపాయలలో ప్రత్యేక పూజలు... మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సిఎం, మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వందేళ్ల క్రితం ప్రఖ్యాత మందిరాన్ని నిర్మించడంలో భాగస్వామ్యమైన ప్రజలకు భోజనం పెట్టిన మెదక్ చర్చి దేశంలోనే గొప్పదిగా కీర్తించబడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం చట్టం అమలులోకి వచ్చిందని అన్నారు. బుధవారం ఆయన మెదక్ జిల్లాలో పర్యటించారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ్మ, ఎంపి, ఎమ్మెల్యేలతో కలిసి ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. రూ.750 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు అక్కడే శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి మెదక్ చర్చి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... వందేండ్ల చరిత్ర కలిగిన మెదక్ చర్చి దేశంలోనే గొప్ప దేవాలయంగా పరిఢవిల్లుతుందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా ఉందన్నారు. చర్చి ఖ్యాతిని మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మెదక్ చర్చితో తనకు గొప్ప అనుబంధముందన్నారు. టిపిసిసి ప్రెసిడెంట్ అయ్యాక ఇక్కడికి వచ్చానని... ఏడాదయ్యాక సిఎం హోదాలో తిరిగి చర్చికి వస్తానని అప్పుడే భక్తులకు మాట ఇచ్చానని గుర్తు చేశారు. మెదక్ చర్చి వందేండ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. పేదల ప్రభుత్వం ఉన్నప్పుడే ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్ వంటి పథకాలు అమలవుతాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో దళిత, గిరిజన క్రిస్టియన్లకు అత్యధికంగా ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని హామీ ఇచ్చారు. హెల్త్, ఎడ్యుకేషన్ రంగాల్లో మిషనరీలు చేస్తున్న సేవల మాదిరే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.పది లక్షల వరకు వైద్య సేవలందిస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 బోనస్, రూ.21 వేల కోట్ల రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధి విషయంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఇంఛార్జి మంత్రి కొండా సురేఖ అండగా ఉంటూ అభివృద్ధికి పాటు పడతారని భరోసా ఇచ్చారు.

రూ.750 కోట్లతో అభివృద్ధి పనులు

ఏడుపాయల దర్శనం సందర్భంగా రూ.750 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని సిఎం ఆవిష్కరించారు. మెదక్ ఇందిరా శక్తి భవన నిర్మాణానికి రూ.ఐదు కోట్లు, ఏడుపాయలలో బిటి రోడ్లు, డివైడర్లు, హైమాక్స్ లైట్ల ఏర్పాటుకు రూ.35 కోట్లు, గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణం కోసం రూ.45.32 కోట్లు, ఆర్‌అండ్‌బి రోడ్ల నిర్మాణం కోసం రూ.7.44 కోట్లు, శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న మెదక్ చర్చి అభివృద్ధి కోసం రూ.29.18 కోట్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం రూ.203 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లాల్లోని స్వయం సహాయ మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.100 కోట్ల చెక్‌ను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, ఎంపిలు రఘునందన్‌రావు, సురేష్‌షెట్కర్, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్‌రావు, సంజీవరెడ్డి, మదన్‌మోహన్ రావు, మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పాల్గొన్నారు.

సిఎం పర్యటనతో గేట్లకు తాళాలు

మెదక్ చర్చిలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలకు సిఎం హాజరవుతున్న సందర్భంగా చర్చి గేట్లను మూసేసి తాళాలేశారు. రద్దీ ఎక్కువైతే బందోబస్తుకు ఇబ్బంది కలుగుతుందని పోలీసులు యాత్రికులు చర్చి లోపలికి వెళ్లకుండా నియంత్రించారు. దీంతో కొందరు యాత్రికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండగతో పాటు వందేండ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా మెదక్ చర్చిని సందర్శించేందుకు యాత్రికులు అధికంగా వచ్చారు. సిఎం వచ్చిన సమయంలో గేట్లు మూసివేసి యాత్రికులను నియంత్రించడంతో బయటే ఉండిపోయిన వాళ్లు పోలీసులపై మండిపడ్డారు.

బాలికను వెంటాడి.. లైంగికదాడికి యత్నం

- నలుగురు నిందితులపై పోక్సో కేసు, అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ బాలికను నలుగురు యువకులు వెంబడించి లైంగికదాడికి యత్నించిన ఘటన హైదరాబాద్ బోరబండలో వెలుగుచూసింది. బోరబండ సిఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన 17 ఏండ్ల బాలిక బోరబండలోని దగ్గరి బంధువుల వద్ద ఉంటూ మాదాపూర్‌లోని ఒక హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నారు. మంగళవారం వేతనం కోసం మాదాపూర్ హోటల్‌కు వెళ్లారు. తిరిగి అక్కడి నుంచి బోరబండ వచ్చే క్రమంలో అదే హోటల్‌లో కుక్‌గా పనిచేసే బీహార్‌కు చెందిన 18 ఏండ్ల యువకుడితో కలిసి రాత్రి 10:40 గంటలకు ఆటో ఎక్కింది. ఆటో బోరబండ వస్తుండగా దారిలో సంత ప్రాంతం వద్ద నలుగురు యువకులు ఆటోను అడ్డగించారు. వారిలో ఇద్దరు ఆటో ఎక్కారు. ఒకడు బాలికను వేధిస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. మిగతావారు బైక్‌పై ఆటోను వెంబడించారు. ఇది గమనించిన యువకుడు, ఆటో డ్రైవర్ హెచ్చరించినప్పటికీ లెక్కచేయలేదు.

ఆటో డ్రైవర్‌పై దాడి చేశాడు. అయినా ఆటోడ్రైవర్ బాలికను ఇంటి వద్ద దింపి వెళ్లిపోయాడు. అయినా నిందితులు ఇంట్లోకి చొరబడి బాలికను వేధించసాగారు. బంధువులు 100 నెంబర్‌కు ఫోన్ చేయడంతో బోరబండ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండు బైకులు, ఒక కత్తి, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బాలిక నుంచి వివరాలు రికార్డు చేయడం కోసం భరోసా కేంద్రానికి తరలించినట్టు సీఐ తెలిపారు.

మాతా, శిశు సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత

- ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.30 లక్షలతో అధునాతన సౌకర్యాలు
- మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవజాత శిశుసంరక్షణలో భాగంగా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.30 లక్షలతో నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో అధునాతన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. బుధవారం నల్లగొండ జిల్లాకేంద్ర ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కటి రూ.90 వేల విలువ చేసే 15 నైన్ నియోటెక్ వార్మర్లను , రూ.30 వేల విలువ కలిగిన 10 నియో ఫొటోథెరఫీ సింగిల్ సర్ఫేస్

యూనిట్లను, రూ.2.50 లక్షలు విలువ కలిగిన పది ఆకాష్ సైరింగ్ పంపులను, రూ.4.50 లక్షల విలువ కలిగిన ఐదు నెల్ కార్ పల్స్ ఆక్సో మీటర్లను, రూ. ఐదు లక్షల విలువ కలిగిన రెండు ట్రాన్స్యూటేనియస్ బిలురుబినేటర్లు, 100 మిట్టర్లు,100 బూటీలు, 200 స్వద్దేస్ బ్లాంకెట్లు, నాలుగు బబుల్ సిపిఎపి కంప్రెసర్లు, మూడు నియోనటల్ రెస్యూటేషన్ కిట్లు, ఎన్ఐబిపి నాలుగు యూనిట్లు, 13 లీటర్ల ఆటో క్లావే, నాలుగు రూమ్ టెంపరేచర్ థర్మామీటర్లు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేశారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద జనాభా కలిగిన జిల్లా నల్లగొండ అని అన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రికి ప్రతిరోజు 1500 మంది అవుట్ పేషెంట్లు, వెయ్యి మందికి పైగా ఇన్ పేషెంట్లు వస్తుంటారని, ఇక్కడ ప్రతి నెల 600 డెలివరీలు అవుతాయని చెప్పారు. 12 ఏండ్ల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, తిరిగి మళ్లీ ఇప్పుడు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.30 లక్షల విలువ కలిగిన అధునాతన పరికరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆస్పత్రిని పూర్తిగా ఉస్మానియా, నీలోఫర్‌లాగా అవసరమైన సౌకర్యాలన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే వారం నుండి గురుకులాలను తనిఖీ చేస్తామన్నారు. చిన్నపిల్లల ఐసియును 50 పడకలకు నుండి 80కి పెంచినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, చిన్న పిల్లల విభాగం అధిపతి డాక్టర్ వందన, ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE W. G. DISTRICT AT : TANUKU

I.A No: 431 of 2023
IN
O.S No. 15 of 2016

Between:
VEERAMALLA SRINIVASA RAO. & another ...Petitioners/Plaintiffs
And
KARRI VENKATA PRASADA REDDY & 3 others. ...Respondents/Defendants

To,
Respondent No.4. Karri Naga Vijaya, Dlo Late Venkat Prasad Reddy, Hindu, Female, aged 28 Years, student, R/o H. No: 349, Someswara Nilayam, H.M.T,Colony, Sathavahana Nagar, Kukatpally, Hyderabad, Telangana State.

Please take notice that the above I. A. NO.431 of 2023 is filed against you and the same is posted to **03.01.2025** for your appearance in the above Court at **10.30** A.M.If you fail to attend the Court on that day the matter will be heard and decided exparte.

// BY ORDER OF THE COURT//
B. J. REDDY
BA. REDDY
Advocates,
Eluru,
Mobile. No. 9703234999

'సన్న'మైనా వద్దట..!

- ప్రభుత్వ జాబితాలో ఉన్న వంగడాలైనా కొనుగోళ్లకు విముఖత
- ఎంటియు 1271, 1262 వెరైటీల ధాన్యం తిరస్కరణ
- మిల్లర్లు తీసుకోవట్లేదంటున్న క్షేత్రస్థాయి అధికారులు
- రూ.500 బోనస్‌ను కోల్పోతున్న అన్నదాతల్లో ఆందోళన
- 33 రకాలను కొంటున్నామంటున్న జిల్లాస్థాయి ఆఫీసర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం చెబుతున్న దానికి భిన్నమైన పరిస్థితులు క్షేత్రస్థాయిలో ఉన్నాయి. కొనుగోలు చేసే 33 రకాల సన్నాల జాబితాను సర్కారు ప్రకటించింది. ఆ వంగడాలకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ కూడా చెల్లిస్తామంది. అయితే ఆ లిస్టులో ఉన్న వడ్లను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాల్లో విముఖత వ్యక్తం చేస్తుండడంపై అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ప్రకటించిన 33 రకాల సన్నాల్లో పలు వెరైటీలను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు విముఖత వ్యక్తం చేస్తుండటంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవేళ కొనుగోలు చేసినా దొడ్డు రకంగా పరిగణిస్తామనడంతో ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.500 బోనస్‌ను రైతులు కోల్పోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఉన్న వంగడాలను తీసుకొచ్చినా పొడవు తక్కువ ఉందనో.. లావు ఎక్కువుందనో కొర్రీలు పెడుతూ కొనుగోలు కేంద్రాల అధికారులు తిరస్కరిస్తున్నారు. కొన్ని జాబితాలో లేకపోయినా కొనుగోలు చేస్తున్నారు. ఉదాహంణకు జై శ్రీరామ్ సూపర్ ఫైన్ రకం సన్నాల లిస్టులో లేదు. అయినా ఈ రకం వంగడాలను కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ఆసక్తి చూపుతుండటంతో పలు కేంద్రాల్లో కొంటున్నారు. కానీ జాబితాలో ఉన్న మారుతీరు మసూరి (ఎంటియు) 1262, 1271 వంటి రకాల ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల మారు'తీరని' వ్యథలు..

మారు తీరు మసూరి వంగడాలను సాగు చేసిన రైతుల పరిస్థితి వర్ణనాతీతం. దోమకాటు, ఇతర పలు రకాల తెగుళ్లను తట్టుకోవడంలో ఈ రకం పేరుగాంచింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ సన్నరకం విత్తనాలను వరుణ్ అగ్రోటెక్, కరీంనగర్ నుంచి ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పలు మండలాల రైతులు తెప్పించుకున్నారు. ఈ రకం విత్తనాలు 25 కేజీలున్న ఒక్కో

బ్యాగ్‌ను రూ.1,234కు రైతులు కొనుగోలు చేశారు. ఇది ప్రభుత్వం ప్రకటించిన 33 రకాల జాబితాలో ఉండడంతో రైతులు నిశ్చింతగా వీటిని నాటారు. కానీ తీరా ఉత్పత్తి వస్తున్న దశలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వీటిని తీసుకునేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

ఇదేమంటే మిల్లర్లు ఈ రకం విత్తనాలను దొడ్డువడ్ల కింద పరిగణిస్తున్నారని క్షేత్రస్థాయి అధికారులు చెబుతున్నారు. జాబితాలో ఉంది కాబట్టి ఇదీ సన్న రకమేనని జిల్లాస్థాయి అధికారులు అంటున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెం రైతులు పలువురు వీటిని సాగు చేశారు. ఉత్పత్తి రావడంతో మండలంలోని ఎర్రబోడు ఐకెపి కొనుగోలు కేంద్రానికి పలుమార్లు శాంపిల్ తీసుకెళ్లారు. పరీక్షించిన అధికారులు పొడవు తక్కువ ఉందనే పేరుతో వీటిని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని చెప్పారు. ఒకవేళ కొనుగోలు చేయాల్సి వస్తే దొడ్డురకం కింద తీసుకుంటామన్నారు. ఇలా చేస్తే సన్నాలు క్వింటాకు వచ్చే రూ.500ను రైతులు కోల్పోవాల్సి ఉంటుంది. బీపీటీ సాంబ మసూరిని మాత్రమే మిల్లర్లు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

సన్నాల జాబితాలోని రకాలు..

సిద్ధి (డబ్ల్యుజిఎల్ 44), కంపసాగర్ వరి-1 (కెసిఎస్ 2874), సాంబ మసూరి (బిపిటి 5204), జగిత్యాల వరి-3 (జెజిఎల్ 28545), జగిత్యాల వరి-2 (జెజిఎల్ 28545), వరంగల్ సాంబ (డబ్ల్యుజిఎల్ 14), వరంగల్ సన్నాలు (డబ్ల్యుజిఎల్ 32100), జగిత్యాల మసూరి (జెజిఎల్ 11470), పొలాస ప్రభ (జెజిఎల్ 384), క్రిష్ణ (ఆర్ఎన్ఆర్ 2458), మానేరు సోనా (జెజిఎల్ 3828), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), వరంగల్ వరి - 1119, కూనారం వరి-02 (కేఎన్ఎం 1638), వరంగల్ వరి-02 (డబ్ల్యుజిఎల్ 962), రాజేంద్రనగర్ వరి-04 (ఆర్ఎన్ఆర్ 21278), కూనారం వరి-1 (కేఎన్ఎం 733), జగిత్యాల సన్నాలు (జెజిఎల్ 1798), జగిత్యాల సాంబ (జెజిఎల్ 3844), కరీంనగర్ సాంబ (జెజిఎల్ 3855), అంజన (జెజిఎల్ 11118), నెల్లూరి మసూరి (ఎన్ఎల్ఆర్ 34449), ప్రత్యుమ్న (జెజిఎల్ 17004), సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465), శోభిని (ఆర్ఎన్ఆర్ 2354), సోమ్‌నాథ్ (డబ్ల్యుజిఎల్ 347), ఆర్ఎన్ఆర్ 31479 (పిఆర్‌సి), కేపీఎస్ 6251 (పిఆర్‌సి), జెజిఎల్ 33124 (పిఆర్‌సి), హెచ్‌ఎంటీ సోనా, మారుతీరు సాంబ (ఎంటియు 1264), మారుతీరు మసూరి (ఎంటీయూ 1262), ఎంటియు 1271 తదితర సన్న రకాలను కొను గోలు కేంద్రాల్లో సేకరించాలని ప్రభుత్వం సూచించింది. కానీ ఈ జాబితాలో ఉన్న పలు రకాల వంగడాలను కొనుగోలు చేసేందుకు మిల్లర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

జాబితాలో ఉన్నా కొనట్లేదు : వినోద్‌చందర్‌రావు, రైతు, బాజుమల్లాయిగూడెం, కారేపల్లి

సన్నాల జాబితాల్లో ఎంటీయూ-1271, 1262 రకాలు ఉన్నాయి. నేను 8 ఎకరాల్లో ఎంటీయూ 1271 సాగు చేశాను. మా గ్రామంలో పలువురు 1262 రకాన్ని వేశారు. కరీంనగర్ వరుణ్ ఆగ్రోటెక్ నుంచి ఈ విత్తనాలను తెప్పించాం. దిగుబడి వచ్చాక ఎర్రబోడు ఐకెపి కేంద్రానికి పలుమార్లు శాంపిల్ తీసుకెళ్లాం. అన్ని చూసుకొనే సాగు చేస్తే తీరా మిల్లర్లు తీసుకోమంటున్నారు. కొనుగోలు చేయడం కుదరదని అక్కడి అధికారులు చెబుతున్నారు. గట్టిగా అడిగితే మిల్లర్లతో మాట్లాడుతామంటున్నారు.

మిల్లర్లు తీసుకోవట్లేదు : గౌసియా, సిసి ఐకెపి, మాణిక్యారం క్లస్టర్

ఎంటీయూ రకాలను మిల్లర్లు తీసుకోవట్లేదు. సాంబ కంటే లావు అధికంగా ఉందని తిరస్కరిస్తున్నారు. కేవలం బిపిటి సాంబ మాత్రమే కావాలంటున్నారు. మా దగ్గర కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని ముదిగొండ మండలం శ్రీలక్ష్మి రైస్‌మిల్‌కు పంపుతున్నాం. వారు సూచించిన బిపిటి సాంబ రకాన్ని మాత్రమే కొంటున్నారు. విషయాన్ని ఎపిఎం, ఆ పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ఎంటియు 1271 దొడ్డురకం కింద కొంటాం : శ్రీలత, మేనేజర్, ఖమ్మం జిల్లా పౌరసరఫరాల శాఖ

ఎంటియు 1271 రకం ధాన్యం సన్నరకాలకు ఉండాల్సిన పరిమాణంలో లేదు. కాబట్టి దీన్ని దొడ్డురకం కింద పరిగణిస్తున్నారు. ఇదీ ప్రభుత్వం ఇచ్చిన వెరైటీ. ఇది కాకుండా ప్రయివేటు రకాలు కొన్ని ఉన్నాయి. డిహెచ్‌ఎస్ 1271 మాత్రం దొడ్డు రకం కింద తీసుకుంటాం. ఎంటీయూ రకాలు నిర్దిష్ట పరిమాణం మేరకు ఉంటే సన్నరకం కింద కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం. దొడ్డురకాల కింద పరిగణిస్తే మాత్రం రూ.500 బోనస్ రాదు. జిల్లాలో ఇప్పటి వరకు 31,223 మంది రైతుల నుంచి 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No : 944/2023
IN
O.S.No.123/2016

ఆదెన వెంకట శేషమ్మ ......పిటీషనర్/వాది
Vs
రాగినబోయిన సుబ్బులు (died) & ఇతరులు ... రెస్పాడెంట్స్

ప్రకటన

To,
R3) పుల్లెల ప్రమోద్ కుమార్ S/o ఆదిశేఖర్ ప్రవేట్ ఎంప్లాయి, R/o హౌస్ నెంబరు : 7-1-70/B/1, అమీర్ పేట్, హైదరాబాద్ - 500016.

పై దావా లో మూడవ ప్రతివాదిగా మిమ్మల్ని చేర్చమని సి.పి.సి. ఆర్డర్-1 రూల్-10 ప్రకారం దాఖలు చేసిన పై నంబరు పిటీషన్ లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్య పూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై నంబరు పిటీషన్ లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ ఫిటీషన్‌ను తేది. 06-01-2025నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 నిలకు పై కోర్టువారి ఏదుట స్వయముగాగాని వకీలు ద్వారాగాని హాజరయి పై పిటిషన్ లో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను, లేని ఏడల పై పిటిషన్ ను మీ పరోక్షమందు తీర్మానించచదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి,
బి.యస్.సి., బి.యల్.,
పిటీషనర్ తరపు న్యాయవాది
అద్దంకి

సమావేశంలో మాట్లాడుతున్న శంకరం

సామాజిక చైతన్య రచయిత 'ఉన్నవ లక్ష్మీనారాయణ'

ప్రజాశక్తి - కల్చరల్

వందేళ్ల క్రితమే మాలపల్లి నవల రాసి సమాజంలోని రుగ్మతలను ఎండగట్టిన ఉన్నవ లక్ష్మీనారాయణ సామాజిక చైతన్య రచయిత అని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శంకరం అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా మారుతీ కళా వేదికపై ఉన్నవ లక్ష్మీ నారాయణ సంస్మరణ సమావేశం జరిగింది. గానసభ అధ్యక్షులు కళా విఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత శంకరం హాజరై మాట్లాడారు. తెలుగు నవలా సాహిత్యంలో ఉన్నవ లక్ష్మీ నారాయణ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అయన రచయిత గానే కాక గాంధీజీ పిలుపునందుకుని దళిత దీన జన ఉద్ధరణకు కార్యాచరణ చేపట్టిన మహనీయులు అని వివరించారు. వేదికపై తెలంగాణ కవుల సంఘం అధ్యక్షులు సుతారపు వెంకటనారాయణ, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు ఎస్.బి.రామ్, కవి, వ్యాసకర్త మిద్దె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానం అమలు చేయాలి

- ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లోనైనా ..
- ఆశాలకు 18 వేల కనీస వేతనం అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్
- నల్లగొండలో ఆశావర్కర్ల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ 18వేల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని పిఫ్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని లేదంటే ఆశాలు సమ్మెకు సిద్ధమవుతారని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 31 తేది వరకు నిర్వహించే రాష్ట్ర బస్సుజాతా బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా జాతాకు బతుకమ్మలు బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్ నుండి సుభాష్ విగ్రహం, మైసయ్య విగ్రహం మీదుగా పెద గడియారం వరకు ఆశావర్కర్ల భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎస్‌బిఆర్ ఫంక్షన్ హాల్‌లో డి మహేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సభలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఆశాల వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కనీస వేతనం రూ.18 వేలు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకత్వంలో ఆరోగ్యశాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నాతాధికారులకు ,ఎమ్మెల్యేలకు, మంత్రులకు, అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి జయలక్ష్మి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం స్కీంలో భాగంగా 19 ఏళ్ల నుండి రాష్ట్రంలో ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు.

సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

వీరంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు అని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులను అమలు చేయలేదని దీనివల్ల తెలంగాణలతోపాటు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశాలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా ఎన్‌హెచ్ఎం స్కీంకు బడ్జెట్ ను తగ్గించుకుంటూ వస్తోందన్నారు. బస్సు జాతాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, రాష్ట్ర కోశాధికారి గంగమని, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.సాధన, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.సునిత, ఎన్.పద్మ, ఎం.బాలమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి వెంకటమ్మ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు దండంపల్లి సత్తయ్య, ఏర్పుల యాదయ్య, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, కుమ్మరి శంకర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పెంజర్ల సైదులు, దయానంద్, అద్దంకి నరసింహ, బిమగాని గణేష్, పోలే సత్యనారాయణ, వరికుప్పల ముత్యాలు, అవుట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలకు ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను విరమించుకోవాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిఆర్‌టిల సమస్యలు పరిష్కరించాలి
- సమ్మె విరమణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి : టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సమ్మె చేస్తున్న కెజిబివి ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత పదిహేడు రోజులుగా సమ్మె చేస్తున్న కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో అత్యధికంగా శ్రమదోపిడీకి గురౌతున్నది ఈ ఉద్యోగులేనని తెలిపారు. చేస్తున్న పనికి సమానమైన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వారు పనిచేస్తున్న పోస్టు మూల వేతనం ఇవ్వాలని మాత్రమే వారు కోరుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మొదటి పిఆర్‌సి సిఫారసు మేరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. న్యాయమైన సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఏమాత్రం పట్టించుకోవటం లేదని వారు ఆవేదన చెందుతున్నారని వివరించారు. ఆ క్రమంలోనే ఉద్యోగులు స్వచ్ఛందంగా నిరవధిక సమ్మెకు దిగారని గుర్తు చేశారు. కెజిబివి, యుఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు విద్యాబోధన కుంటుపడిందని తెలిపారు. శుక్రవారం నుంచి సమ్మెను ఉధృతం చేస్తామని వారు ప్రకటించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించి సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులపై పన్ను భారం తగదు

- ఉద్యోగ దరఖాస్తులపై కేంద్రం జిఎస్టీని ఉపసంహరించుకోవాలి
- డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులపై పన్నుల భారాలు మోపడం తగదనీ, ఉద్యోగ నియామకాల దరఖాస్తులపై జీఎస్టీని వసూలు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరింది. ఈ మేరకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వడం చాతకాని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామక దరఖాస్తు ఫారాలపై జిఎస్‌టిని వసూలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. అన్ని వస్తువులపైన పన్నుల భారాలను మోపుతున్న కేంద్ర ప్రభుత్వం ఆఖరికి నిరుద్యోగ యువతను కూడా వదలట్లేదని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివిపిస్తున్నారనీ, కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉద్యోగాలకు దూరం చేసేవిధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం, అప్పుడప్పుడు ఇచ్చిన నోటిఫికేషన్‌లపై దరఖాస్తులకు జిఎస్‌టిని విధించడం దుర్మార్గమని తెలిపారు. అగ్నివీర్‌తో సహా మిగిలిన ఉద్యోగ నియామకాల దరఖాస్తు ఫారాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కల్యాణ్ సింగ్ సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని పలు ఉద్యోగ ఖాళీల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్ దరఖాస్తు ఫీజుతోపాటు దానిపై 18 శాతం జీఎస్టీని చెల్లించాలంటూ నోటిఫికేషన్ జారీ చేసిందని వివరించారు. అందులో అన్ రిజర్వ్‌డ్, ఓబీసీ కేటగిరీల వారికి రూ.1000, ఎస్‌సి/ఎస్‌టిలకు రూ.600 దరఖాస్తు ఫీజు ఉండగా దానిపై 18 శాతం జీఎస్టీ కట్టాలని ఉందని తెలిపారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలంటే 18 శాతం జీఎస్టీని విధించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

తునికి గ్రామం నాకు మార్గదర్శకం

- సేంద్రీయ సాగు రైతులతో ఉప రాష్ట్రపతి ఆత్మీయ సమ్మేళనం
- కౌడిపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రంలో గవర్నర్, రాష్ట్రమంత్రితో కలిసి పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సేంద్రీయ సాగు రైతులతో సమ్మేళనం చాలా సంతోషకరంగా ఉందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి, సేంద్రీయ రైతు సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి హెలికాప్టర్ ద్వారా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఆయన సతీమణి డాక్టర్ సుదేశ ధన్కర్ చేరుకున్నారు. ఆయనతో పాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఉన్నారు. మొదట విజ్ఞాన కేంద్రంలో మొక్క నాటి అక్కడే ఏర్పాటు చేసిన సేంద్రీయ ఎరువులకు సంబంధించిన స్టాల్స్‌ను ఉపరాష్ట్రపతి పరిశీలించారు. అనంతరం కేవికేలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ సాగుపై దాదాపు 800 మంది రైతులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. మెదక్ జిల్లాలో 655 మంది రైతు కుటుంబాలు సేంద్రీయ సేద్యం చేపట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారని జగదీప్ ధన్కర్ అన్నారు. వారంతా మూడు రోజుల పాటు ఢిల్లీకి రావాలని కోరారు. ఊరు చిన్నది అయినా తనకు మార్గదర్శకమన్నారు. మెదక్ జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం చేసిన రైతులు, గ్రామ పంచాయతీ సభ్యులు తనకు ప్రత్యేక అతిథులని, వారికి ఢిల్లీలో ఆతిథ్యం ఇస్తానన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికాసానికి లాల్ బహదూర్ శాస్త్రి, జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదంతో వాజ్‌పేయి, జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ నినాదంతో ప్రధాని మోడీ కృషి చేస్తున్నారన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ధన్కర్

మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

రాబోయే కొద్ది కాలంలోనే భారత్ ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతుందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2001లో అప్పటి ప్రధాని వాజ్ పేయి నేతృత్వంలో కిసాన్ దివస్‌ను ప్రకటించారు. అది త్వరలో రజతోత్సవం జరుపుకోబోతుందన్నారు. దేశంలోని 730 పై చిలుకు కృషి విజ్ఞాన కేంద్రాలు, 150 పై చిలుకు ఐకార్ సంస్థలు ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీలపై ఆధారపడకుండా సోలార్ ఎనర్జీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులతో చర్చించి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.

ఆర్గానిక్ సాగు దిశగా అడుగులు : గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ఆర్గానిక్ సాగు చేస్తున్న 800 మంది రైతులు ఈ సమ్మేళనంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రైతులు ఆర్గానిక్ సాగు దిశగా అడుగులు వేయడం బాగుందన్నారు.

ఏకాదశి అధ్యయనోత్సవాలకు సిద్ధం

- భద్రగిరిలో 21 రోజుల పాటు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు
- ముక్కోటి ఏర్పాట్లపై ఆలయ ఇఒ రమాదేవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహించే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నట్టు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. ఇక్కడ శ్రీరామనవమితో పాటు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఉన్న ప్రాధాన్యత ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదన్నారు. ఈ నెల 31 నుండి జనవరి 20వ తేదీ వరకు జరగనున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల ఏర్పాట్లపై నవతెలంగాణకు ఆమె ప్రత్యేకంగా వివరించారు. ముక్కోటి అధ్యయనోత్సవాలల్లో అత్యంత ప్రాధాన్యత గల స్వామి వారి దశావతారాలు ఈనెల 31 నుండి ప్రారంభం కానున్నట్టు ఆమె తెలిపారు. జనవరి 9న సాయంత్రం నాలుగు గంటలకు గోదావరి నది తీరాన హంస వాహనంపై విహరించే తెప్పోత్సవ కార్యక్రమాన్ని వీక్షించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు తరలివస్తారని, దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వైకుంఠంలోని మహావిష్ణువు 33 కోట్ల మంది దేవతలకు ఏకాదశిరోజు ఉత్తర ద్వారం నుండి దర్శనం ఇస్తారని, దానికోసం 9న అర్ధరాత్రి 12 గంటలకే తహసీల్దారు సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 10న ఉదయం ఐదు గంటలకే భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు.

నది తీరాన గిరిజన ఉత్సవాలు

ఈ ప్రాంత గిరిజన సంస్కృతి సంప్ర దాయాలు రాష్ట్ర వ్యాప్తంగా తెలిసే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల ఆధారంగా నది తీర ప్రాంతంలో గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేసినట్టు రమాదేవి తెలిపారు. ముక్కోటి అధ్యయనోత్సవానికి సంబంధించిన అన్నిరకాల సేవలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. 250 రూపాయలు టికెట్ నుండి 2000 రూపాయల వరకు వీఐపీ టికెట్లు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే అవకాశాన్ని ప్రారంభించామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో అధ్యయనోత్సవాలను విజయవంతం చేసేందుకు కషి చేస్తున్నామని రమాదేవి తెలిపారు. మహిళా అధికారినైనప్పటికీ శక్తివంచన లేకుండా రామయ్యకు అవకాశం ఉన్న మేరకు సేవలందిస్తున్నానని, సామాజిక మాధ్యమాలలో అనవసర దుష్ప్రచారం చేసే వాళ్ళకి చిత్తశుద్ధితో అప్పగించిన విధులను నిర్వహించడమే సమాధానంగా భావిస్తున్నానని ఇఒ రమాదేవి స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు

- 27న పోలీస్ స్టేషన్‌కు రావాలని..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు మసాబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని నోటీసులో పేర్కొన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యేపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కౌశిక్ రెడ్డితో పాటు 20 మంది అనుచరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. సీఎం రేవంత్ రెడ్డి, ఐజీ శివధర్ రెడ్డి తన ఫోన్ టాప్ చేస్తున్నారంటూ ఈ నెల 4న బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన సమయంలో సీఐతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. తన ఫిర్యాదును తీసుకున్న తర్వాతనే వెళ్లాలని పట్టుబట్టారు. అనంతరం బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 27న వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు.

పదేళ్ల పాటు క్రిస్మస్ తోఫాను అందించాం

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంలోనే అతి ఎక్కువమంది నిర్వహించుకునే పండుగ క్రిస్మస్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేటలోని సీఎస్ఐ చర్చిలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి వారిని ప్రేమించి, వారికి సహాయం చేయడంతోనే జన్మ ధన్యమవుతుందని ఏసు బోధనలో ముఖ్యమైనదని, క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా జరిపిన ఒకే ఒక్క వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేండ్లపాటు క్రిస్మస్ తోఫాను అందించామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని కొనసాగించలేదని, కులమేదైనా, మతమేదైనా దేశమేదైనా అందరూ సమానమేనన్నారు. కొంతమంది వ్యక్తులు కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టి విడదీస్తున్నారని అన్నారు. విజ్ఞులైన వారంతా ఒక్కటిగా ఉండి, దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, చర్చి ఫాదర్ ఆంటోనీ, తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ రీల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న త్రివిక్రమ్, తదితరులు

చరిత్రను ఆసక్తికరంగా రాయడం గొప్ప కళ

- ప్రముఖ సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సహజంగా చరిత్ర బోర్ అంశం అని.. అయితే అలాంటి విషయాన్ని ఆసక్తికరంగా చెప్పటం, రాయటం గొప్ప కళ అని ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. రెంటల జయదేవ ఫస్ట్ రీల్ సినిమా చరిత్రను ఆసాంతం విసుగు కలుగకుండా కళాత్మకంగా రాశారని అభినందించారు. బుధవారం హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలోని 37వ బుక్ ఫెయిర్‌లో బోయి విజయ భారతి వేదికపై ప్రముఖ సినీ రచయిత జర్నలిస్ట్ రెంటాల జయదేవ రచించిన 'మన సినిమా ఫస్ట్ రీల్' గ్రంథాన్ని ముఖ్య అతిథిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ హాజరై ఆవిష్కరించారు. జయదేవ మొదటి వాక్యంతోనే పాఠకుడిలో ఉత్సుకత పెంచారని చెప్పారు. గత సినిమాలకు చెందిన విశేషాలు పోస్టర్‌లను ఆధారం చేసుకున్నారని, మూకీ చిత్రాల కాలంలో గుడారాలు వద్ద వాతావరణం అద్భుతంగా ఆవిష్కరించారన్నారు. ఆయనది కేవలం కాలమిస్ట్ స్థాయి కాదనీ అంతకు మించిన ప్రతిభ ఉన్నవారని, చెప్పే అంశం సాధికారంగా చెప్పే శక్తి ఉన్నవారు అని వివరించారు. జయదేవ తాను చెప్పే విషయంపై పరిపూర్ణ అవగాహన ఉంటేనే చెబుతారని, అందుకే ఆయన తక్కువ రచనలు చేశారని చెప్పారు. అజ్ఞానం రచయితకు అవసరం అని అప్పుడు ధైర్యంగా తాను అనుకున్నది రాస్తారన్నారు. అధ్యక్షత వహించిన ఎమెస్కో అధినేత విజయ కుమార్ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్ర గురించిన సమగ్రంగా ఫస్ట్ రీల్ చెబుతుందని తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ సృజనాత్మకత సాంకేతికత మిళిత కళా రూపం సినిమా అన్నారు. వేదిక పై ఐఆర్ఎస్ అధికారి కృష్ణ కౌండిన్య, బుక్ ఫెయిర్ కార్యదర్శి వాసు, షేక్ మీరా, చంద్ర శేఖర్ రెడ్డి, రచయిత కుమార్తెలు మహతి, ప్రణతి పాల్గొన్నారు.

ఉచ్చు బిగుస్తోంది

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో కిషోర్ వాంగ్మూలం రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసుకు సంబంధించి రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ వాంగ్మూలాన్ని ఎసిబి అధికారులు నమోదు చేశారు. గతంలో ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణకు సంబంధించి హెచ్ఎండిఎకు చెందిన ఐఒబి ఖాతా నుంచి రూ.54.88 కోట్లను ఎఫ్ఇఒ విదేశీ కంపెనీకి బదిలీ చేశారంటూ ఇందులో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని దాన కిషోర్..ఎసిబికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 19న గత ప్రభుత్వంలోని మునిసిపల్ వ్యవహారాల మంత్రి కెటిఆర్, అప్పటి హెచ్ఎండిఎ కమిషనర్ అరవింద్‌కుమార్, హెచ్ఎండిఎ సిఇఒ బీఎల్ఎన్ రెడ్డిల పైన ఎసిబి అధికారులు నాలుగు సెక్షన్ల కింద కేసులను నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే, కెటిఆర్‌ను ఈనెల 30 వరకు అరెస్టు చేయరాదంటూ ఈనెల 20న హైకోర్టు.. ఎసిబికి ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో, దర్యాప్తును కొనసాగించటానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తాజాగా దాన కిషోర్ నుంచి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసిన ఎసిబి అధికారులు.. దాని ఆధారంగా ఈ కేసులో ప్రధాన ముద్దాయిగా పేర్కొనబడిన కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అరవింద్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిలకు ఒకట్రెం డ్రోజులలో నోటీసులు జారీ చేసి వారిని విచారించటానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. ఎసిబి నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా కెటిఆర్‌పై పీఎంఎల్‌ఏతో పాటు ఫెమా ఉల్లంఘనల కింద ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు.. తాము కూడా ఇందులో పేర్కొనబడిన నిందితులను విచారించటానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

పక్కదారి పడుతున్న సబ్సిడీ సిలిండర్లు

- చిన్న హోటళ్ల నుంచి రెస్టారెంట్ల వరకూ డొమెస్టిక్ సిలిండర్ల వాడకమే!
- అక్రమార్జనే లక్ష్యంగా డీలర్ల ఎత్తులు
- మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు

ప్రజాశక్తి - హైదరాబద్ బ్యూరో

పేద, మధ్య తరగతి ప్రజలకు అందించే రాయితీ వంట గ్యాస్ సిలిండర్లు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రాయితీ సిలిండర్ల నుంచి నాలుగు వరకూ మినీ సిలిండర్లలో నింపే దందా పెద్దఎత్తున్నే సాగుతోంది. ఇలా ఒక్కో సబ్సిడీ సిలిండర్‌పై అదనంగా రూ.వెయ్యి సంపాదిస్తుండగా.. మరోవైపు డీలర్లే డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ సంస్థలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏడాదిలో రెండు, మూడు మాత్రమే సిలిండర్లు వాడుకునే కుటుంబాల కనెక్షన్లనే వారికి తెలియకుండా బుక్ చేస్తూ హోటళ్లు, వాణిజ్య సంస్థలకు మళ్లిస్తున్నారు. అయితే, వినియోగదారుల పేరిట సిలిండర్లు బుక్ చేసినప్పుడు వచ్చే మెసేజ్‌లను చూసుకునే వాళ్లలో ఎవరైనా ప్రశ్నిస్తే పొరపాటు జరిగిందని దాటవేస్తూ వస్తున్నారు. మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్ల దందా సాగుతోంది. ఇదంతా కండ్ల ఎదుటే సాగుతున్నా పౌరసరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్, మంకమ్మతోట, గణేశ్‌నగర్, కోతిరాంపూర్, పెద్దపల్లిరోడ్, కోర్టుచౌరస్తాల్లో పదుల సంఖ్యలో గ్యాస్ రీఫిల్లింగ్ దుకాణాలున్నాయి. జిల్లా కేంద్రంలోని పలు హోంనీడ్స్ దుకాణాలు గ్యాస్ అక్రమ ఫిల్లింగ్ వ్యాపారానికి అడ్డాగా మారాయి. హైదరాబాద్ నుంచి చిన్న సిలిండర్లు కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చి వ్యాపారం చేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో మినీ సిలిండర్లు విక్రయిస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. రాయితీ గ్యాస్ ధర రూ.840 కాగా, వాణిజ్య సిలిండర్ ధర రూ.1600గా ఉంది. రాయితీ గ్యాస్ కనెక్షన్లకు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం

రూ.500కే సిలిండర్ వచ్చేలా మిగతా సొమ్ము వినియోగదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ సిలిండర్లను ఏజెన్సీ నిర్వాహకుల సాయంతో కొందరు కొనుగోలు చేసి రహస్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న గోదాములకు తరలిస్తున్నట్టు సమాచారం. మరికొందరు మినీ సిలిండర్లలో రీఫిల్లింగ్ చేస్తున్నారు. అయితే, ఈ దందా అంతా జనావాసాల నడుమనే సాగుతుండగా.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వినియోగదారులకు తెలియకుండానే బుకింగ్

కరీంనగర్ జిల్లాలో 21 ఎల్‌పిజి ఏజెన్సీల పరిధిలో జనరల్, సిసిఆర్, దీపం పథకం కనెక్షన్లు అన్నీ కలిపి 3,12,206 ఉన్నాయి. వినియోగదారుడికి గ్యాస్ సిలిండర్ కావాలంటే మొదట బుక్ చేసుకోవాలి. ఆ తరువాత డెలివరీ సమయాన ఒటిపి చెప్పాలి. ఇదంతా సామాన్య వినియోగదారులకే వర్తిస్తుండగా.. కొందరు డీలర్లు ఇతరులకు ఎలాంటి ఆంక్షలూ లేకుండా అమ్మేస్తున్నారు. ఏటా రెండు నుంచి మూడు సిలిండర్లు మాత్రమే బుక్ చేసుకునే వారిని లక్ష్యంగా చేసుకుని వారి పేరిట బుక్ చేసి ఇతరులకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఈ సమాయన వినియోగదారుడి సెల్ నెంబర్‌కు బుక్ చేసినట్టు, డెలివరీ అయినట్టు మెసేజ్‌తో పాటు ఒటిపి వచ్చినా.. ఆ వివరాల కోసం ఎవరూ ఫోన్ చేయడం లేదు. దీంతో ఒటిపితో పని లేకుండా ఈ దందా ముందుకు సాగుతోంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ డబ్బులు ఎలాగూ 'మీ ఖాతాలోనే పడతాయి. సిలిండర్ డబ్బులు మేము చెల్లించి తీసుకుంటాం' అంటూ ఏడాదిలో తక్కువ సంఖ్యలో వాడే వినియోగాదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. వాణిజ్య అవసరాలకు సిలిండర్‌పై రూ.వంద నుంచి రూ.150అదనంగా విక్రయిస్తున్నారు. ఇందుకు డెలివరీ బాయ్స్, ఇతర ప్రయివేటు వ్యక్తులు ఈ వ్యవహారాన్ని సాగిస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. మొత్తంగా పక్కదారి పడుతున్న సిలిండర్లన్నీ వాణిజ్య అవసరాలకు మళ్లుతున్నాయి. తోపుడు బండ్లు మొదలుకుని హోటళ్లు, రెస్టారెంట్లలో ఈ సిలిండర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పట్టని పౌరసరఫరాల శాఖ

గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతున్నా పౌరసరఫరాల సంస్థ అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు. డీలర్లు లెక్కాపత్రం లేకుండా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు విక్రయిస్తున్నా తనిఖీల మాట ఎత్తడం లేదు. గ్యాస్ గోదాముల్లో, ఏజెన్సీల్లో తనిఖీలు చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి.

డెలివరీ బాయ్స్ దందా

సిలిండర్లు డెలివరీ చేసే సిబ్బంది ఐదు కిలోమీటర్ల వరకు సిలిండర్‌ను ఉచితంగా డోర్ డెలివరీ చేయాలని, 30 కిలోమీటరు అయితే రూ.10, అంతకు మించి దూరమైతే రూ.15 వసూలు చేసుకోవచ్చనే నిబంధనలు ఉన్నాయి. కానీ ఎక్కడైనా సరే సిలిండర్ తీసుకొస్తే చాలు రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మరుసటి నెల ఆలస్యం చేయడమో లేదంటే డోర్ లాక్ చేసి అని దాటవేయటమో చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం
నర్సింగరావు, డిఎస్ఒ- కరీంనగర్

వినియోగదారులకు సంబంధం లేకుండా గ్యాస్ బుక్ చేసినట్టు, డెలివరీ ఇచ్చినట్టు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. ఇలా చేసే ఏజెన్సీలపై చర్యలు ఉంటాయి. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడకుండా తనిఖీ చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేయాలి.